## క్లుప్తంగా

### విమాన గోపురం పనులకు పూజలు



**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలోని వీరాంజనేయ స్వామి వారి ఆలయ విమాన గోపురం పనులకు శనివారం పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న వీరాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ పూజలు జరిపించారు. హోమాలు నిర్వహించిన అనంతరం విమాన గోపురం శిలాస్థాపనకు పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, డైరెక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో స్వచ్ఛాంధ్ర



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద ఆలయ ఈవో శీనానాయక్ అధికారులు, సిబ్బంది చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆలయ పరిసరాలలో శానిటేషన్ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమతుల్య ఆహారంతో ఎముకల్లో పటుత్వం



**భవానీపురం(విజయవాడపశ్చిమ):** సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారానే ఎముకల్లో పటుత్వాన్ని పెంపొందించుకోవచ్చని శ్రీజీవన్ ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కేవీఎస్ఎస్ శివకృష్ణ, డాక్టర్ కె.శ్రీతేజ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో భవానీపురం పాత పోలీస్ స్టేషన్ రోడ్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో ఎముకల పటుత్వం, పక్షవాతం, డయాబెటిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, పీడీజీ చైర్మన్ తటవర్తి దుర్గామల్లేశ్వరరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు పైడిమర్రి వేణుగోపాలరావు, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, సభ్యులు పి.హరినాథ్‌ప్రసాద్, ఐవీ అనిల్ కుమార్, వి.రామారావు పాల్గొన్నారు.

### టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

**విజయవాడ కల్చరల్:** స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన దాతలు కొరపాటి కల్యాణి త్రినాథ్, సుమలత, సీతాదేవి, రాజశేఖర్ దివ్యభారతి, తోట రమేష్, తోట శ్రీలక్ష్మి సహకారంతో శనివారం శ్రీవారి అన్నప్రసాద వితరణ చేశారు. ముందుగా కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి శ్రీనివాసులకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ స్టాల్‌లో తిరుమలలో శ్రీవారికి పూజలకు ఉపయోగించిన పూలతో తయారు చేసిన వీభూది, సుగంధ ద్రవ్యాలు, అగర్‌బత్తిలను విక్రయించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ సేవలో పాల్గొనేవారు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### మధురానగర్‌లో చోరీ

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వీవీ నరసరాజు రోడ్డులోని ఓ ఇంట్లో ఎవరూలేని సమయంలో తాళం పగులకొట్టి సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ. 50వేలు నగదు చోరీ చేశారు. బాలజ్యోతి శుక్రవారం ఇంటికి తాళం వేసి సోదరి ఇంటికి వెళ్లారు. శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ. 50వేల నగదు కనిపించలేదు. కేవలం బీరువాలోని లాకర్‌లోని వస్తువులను మాత్రమే దొంగిలించడం ఇంట్లోని ఏ వస్తువులను ముట్టుకోకపోవడం చూస్తుంటే తెలిసిన వారి పని అయ్యి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

# శిథిలావస్థలో గృహ సముదాయాలు!

- 15 బ్లాకులు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కేటాయింపులు శూన్యం
- మొత్తం 480 ఫ్లాట్స్ తలుపులు, కిటికీలు మాయం
- కిటికీలకు అమర్చిన అద్దాలు ధ్వంసం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నూతన బ్లాకులు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు



నూతనంగా నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ బ్లాకులు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్) పథకం కింద విజయవాడ నగర పాలక సంస్థ నగర శివారులో ఉన్న జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సుమారు ఐదేళ్ల క్రితం నిర్మించిన 15 గృహ సముదాయాలు (బ్లాక్స్) శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కో బ్లాక్‌కు 32 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిరుపయోగంగా ఉన్నాయి. బ్లాకుల చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలతో నిర్మానుష్యంగా ఉండటంతో అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు అడ్డాగా తయారయింది. కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే నిర్మించిన నూతన బ్లాకుల ప్రాంతాన్ని కొందరు బహిర్భూమిగా వాడుకుంటున్నారు. కాలనీలోని వేర్వేరు బ్లాకుల్లో నివసిస్తూ చదువులు మానేసి గాలికి తిరుగుతున్న యువకులు పగలు, రాత్రి తేడా లేకుండా ఈ ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నారు. జనసంచారం లేని కొత్త బ్లాకుల ఏరియాలో మద్యం, మత్తు పదార్థాలు సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నూతన బ్లాకులకు ఒక వైపు చెరువు, మరో వైపు రైలు కట్ట ఉండటంతో చీకటి పడితే అటువైపుకు ఎవరూ వచ్చే పరిస్థితి లేకపోవడం, సెక్యూరిటీ గార్డ్స్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఆకతాయిలకు ఇష్టారాజ్యం అయిపోయింది. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి ఎదురు తిరగడం, దాడులు చేయడం పరిపాటిగా మారింది.

**తలుపులు, కిటికీలు మాయం...**

నూతనంగా నిర్మించిన 15 బ్లాకులలోని 480 ఫ్లాట్లను ఎవరికీ కేటాయించక పోవడంతో మద్యం, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారు. డబ్బు అవసరమైనప్పుడల్లా ఫ్లాట్స్‌కు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలు ఎత్తుకు పోయి అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా కిటికీలకు అమర్చిన అద్దాలను పగులకొట్టి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడేస్తున్నారు. ప్రతి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 32 ఫ్లాట్స్‌కు సంబంధించి విద్యుత్ మీటర్లను బిగించేందుకు ఏర్పాటు చేసిన కరెంట్ బస్ బార్‌లు కొన్ని మాయం కాగా మరి కొన్ని బ్లాక్ ముందు అడ్డదిడ్డంగా పడేసి ఉన్నాయి. సమయం చూసి వాటినీ ఎత్తుకుపోయి తమ అవసరాల (గంజాయి, మద్యం) నిమిత్తం అమ్ముకుంటున్నారని స్థానికులు అంటున్నారు. వైఎస్సార్ కాలనీ ప్రాంతం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా పోలీసులు అప్పుడప్పుడు వచ్చి కొత్త బ్లాకుల వైపు గస్తీ తిరుగుతున్నారు. అయినా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు షరా మామూలుగానే వ్యవహరిస్తున్నారు. ఫ్లాట్లను లబ్ధిదారులకు కేటాయిస్తే జన సంచారం ఉంటుందని, అప్పుడు ఆకతాయిలు ఇక్కడికి చేరే అవకాశం ఉండదని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు.



బ్లాకులు ఖాళీగా ఉండటంతో కిటికీ అద్దాలు పగులకొట్టి పడేసిన దృశ్యం



ఒక బ్లాకు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్స్ తలుపులు, కిటికీలు మాయమైన దృశ్యం

**మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం.....**

విజయవాడ నగరంలో కాలువగట్లపై నివసించే నిరుపేద ప్రజలు, కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఉంటున్నవారి ఇళ్లను తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఫ్లాట్లు కేటాయిస్తూ వస్తుంది నగరపాలక సంస్థ. అటువంటి వారి కోసం నూతనంగా నిర్మించిన 15 బ్లాకులను ఎవరికీ కేటాయించక పోవడంపై విమర్శలు వెల్లువెతున్నాయి. లబ్ధిదారులు లేరా అంటే.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు తొలగించిన పేదవారు వందల సంఖ్యలో ఉన్నారు. అటువంటి వారంతా నిత్యం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ కనిపిస్తూనే ఉంటారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి పేదల కోసం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడం తమకూ బాధగానే ఉందని, అధికారులు పట్టించుకోకపోతే తాము మాత్రం ఏం చేయగలమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

## సంప్రదాయ విలువలను చాటిన ధాన్వి నృత్యం



**విజయవాడ కల్చరల్:** యువ నర్తకి ఊటుకూరి ధాన్వి కూచిపూడి నృత్య ప్రదర్శన కూచిపూడి సంప్రదాయ విలువలను చాటింది. విఖ్యాత నాట్యాచారిణి శైలజా ప్రసాద్ నృత్య శిక్షణలో శనివారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శించిన అంశాలు మనోహరంగా సాగాయి. రంగపూజతో ప్రారంభించి గజవదనా బేడువే, మద్దుగారే యశోద, సంప్రదాయ నృత్యం భామాకలాపం, రామదాసు కీర్తన తక్కువేమి మనకు, గోవర్ధన గిరిధారి, కంద దళాయ దాక్షి, అంశాలను ప్రదర్శించింది. ఎం. శ్రీనివాస్, శ్రీధరాచార్య, అనిల్‌కుమార్, ఆర్ సుధాకర్‌లు సహకరించారు. నాట్యాచారిణి శైలజా ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ నృత్య సంప్రదాయాల పట్ల ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. కూచిపూడి సంప్రదాయ విలువలను పరిరక్షించుకోవాలని సూచించారు. నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామ శర్మ, జోస్యుల రామచంద్రమూర్తి మాట్లాడుతూ గురు సంప్రదాయం భారతీయ ఆత్మగా అభివర్ణించారు. అనంతరం నాట్యగురువు శైలజా ప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

**నేత్రపర్వంగా...**

అయాచితుల కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శనివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. నాట్యాచారిణి రాఘవేంద్ర నృత్యాలయం నిర్వాహకురాలు బీ నవ్యశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదం

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పశ్చిమ నియోజకవర్గంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలలు, గాంధీహిల్ తదితర ప్రాంతాల్లోని కార్యాలయాల్లో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల క్రీడా విభాగం, ఎన్‌సీసీ, జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడారు. క్రీడా విభాగాధిపతి హేమ చంద్రరావు విద్యార్థులతో యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేయించారు. సుమారు 1500 మంది విద్యార్థులు ఏకకాలంలో ఆసనాలను వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎన్. సాంబశివరావు, డి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం నిర్వహించారు. విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ కోసనం జగదీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గాంధీజీ మహిళా కళాశాలలో విద్యార్థినులు పలు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ ఎం రమణశ్రీ మాట్లాడారు. కళాశాల వైస్ చైర్మన్ కొత్తమాసు వెంకటపిచ్చియ్య, కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. గాంధీ హిల్‌పై కార్యక్రమాన్ని 4(ఎ) బాలికల బెటాలియన్ ఎన్‌సిసి-విజయవాడ, గాంధీ హిల్ ఫౌండేషన్‌తో కలిసి నిర్వహించింది. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, జిల్లా పర్యాటక శాఖాధికారి శిల్పా, గాంధీహిల్ కార్యదర్శి వై.రామచంద్రరావు, కోశాధికారి శివశంకర్ కస్తూరి, కెప్టెన్ శైలజ, కెప్టెన్ రోహిణి కుసుమ తదితరులు పాల్గొన్నారు.

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ)లో వేడుకలను నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయుల ఆధ్వర్యంలో పాలప్రాజెక్టు ఆవరణలో యోగ సాధన చేశారు. ముఖ్య అతిథిగా ఆహార శుద్ధి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి హాజరయ్యారు.

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో శనివారం 20 ప్రధాన రైల్వేస్టేషన్‌లలో నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడ రైల్వే ఫంక్షన్ హాలులో జరిగిన యోగా కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావులతో పాటుగా 350 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి యోగా బోధకురాలు వెలగ స్వాతి, రాజమండ్రికి చెందిన ప్రఖ్యాత యోగా ప్రదర్శనకారిణి సాత్విక సారథ్యంలో అధికారులు, సిబ్బంది యోగసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రసనాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ మహిళా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఆర్‌ఎంలు పీ.ఈ. ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, అధికారులు



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

**బస్టాండ్(విజయవాడపశ్చిమ):** యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆర్టీసీ ఈడీ విజయరత్నం అన్నారు. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. డీపీటీఓ డి.వై దానం, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పలు డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు.

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ శ్రీవెంకటేశ్వర యోగి గురూజీ అనుగ్రహభాషణం చేశారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం భవానీపురం-2 శాఖ, భారత్ వికాస్ పరిషత్ విజయవాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భవానీపురం శివాలయం సెంటర్‌లో యోగులు, యోగ సాధకులు యోగాసనాలను ప్రదర్శించారు.



కేబీఎన్ కళాశాలలో యోగాసనాలను వేస్తున్న విద్యార్థులు

## • ఆసనాలతో ఆరోగ్యం



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు చేశారు. వివిధ రకాల ఆసనాలతో పాటు ప్రాణాయామం చేస్తున్న చిత్రాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిత

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అధునాతన సాంకేతిక అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీసీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ బీవీఎస్ఎస్ఎస్ గోపాల్ అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇండస్ట్రీ ఇంటరాక్షన్ అండ్ కెరీర్ పాత్ వే గైడెన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల పనితీరు, ఉద్యోగ అవకాశాలు, మార్కెట్ డిమాండ్స్, భవిష్యత్తు కెరీర్ అవకాశాల గురించి విలువైన సూచనలు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగం నిత్యం ఆధునీకీకరణ చెందుతుందని తెలిపారు. కాలంతో వేగంగా పోటీపడినప్పుడే సరికొత్త నైపుణ్యాలు సాధించగలుగుతామని చెప్పారు. సాఫ్ట్ వేర్ కెరీర్ ప్రతి క్షణం సవాళ్ళతో కూడుకుని ఉంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏఓ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్. రమేష్ కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాం పవన్, పీజీ కోర్సస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** హరివిల్లు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు శనివారం భోజనం ప్లేట్లను వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రసిక్ సంఘ్వీ మాట్లాడుతూ ఫౌండేషన్ నిర్వాహకులు గత నాలుగు సంవత్సరాల నుంచి చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిమిత్తం దాదాపు 300 స్టీల్ ప్లేట్లు అందజేయటం హర్షణీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేందుకు సరిపడా ప్లేట్లు లేవని ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. వెంటనే తమ ఫౌండేషన్ ద్వారా భోజనం ప్లేట్లు పంపిణీ చేశామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి యు కనకారావు, సభ్యులు మానేపల్లి రామకృష్ణ, సాయి అఖిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేస్తున్న డాక్టర్ రసిక్ సంఘ్వీ

## అలరించిన సినీ సంగీత విభావరి

**విజయవాడకల్చరల్:** అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయని సింధూ పర్యవేక్షణలో గాయకులు రాణి, శ్రేయ, సత్య, ఉదయ్‌కాంత్, శివ, సురేష్, నాని, బెనర్జి, వెంకట్, ప్రసాద్‌లు తెలుగు, హిందీ, చిత్ర గీతాలతో పాటు క్లాసికల్స్, సెమీ క్లాసికల్ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గాయనీ గాయకులు సాధన చేయాలన్నారు. గాయని సింధూ మాట్లాడుతూ సింధూ ఈవెంట్స్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతన గాయనీ గాయకులను వేదికకు పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



చిత్ర గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

## సమన్వయంతో కలిసి ముందుకు సాగుదాం

**ఈవో శీనానాయక్**

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దుర్గగుడిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పని చేస్తున్న అన్ని విభాగాల అధికారులు, ఆలయ అర్చకులు, ఎస్ఎంఆర్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో శనివారం ఆయన సమావేశమయ్యారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ సిబ్బందితో ఈవో చర్చించారు. అమ్మవారి సైన్యంలా పని చేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ : 90102 10386
Office mail : sakshiads@gmail.com